నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



కోటపల్లి మండలంలోని కొల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీస్తున్న ప్రజలు (ఫైల్)

# వివేక్‌పై వ్యతిరేకత

## చెన్నూర్ ఎమ్మెల్యేను చీదరించుకుంటున్న ప్రజలు

- ఎక్కడికెళ్లినా సమస్యలపై నిలదీత ● రోజురోజుకూ పెరుగుతున్న అసహనం
- చుట్టుపు చూపుగా పర్యటనలు.. ● కనీసం కారు దిగి మాట్లాడని శాసనసభ్యుడు
- కాంగ్రెస్ పార్టీలోనూ తగ్గుతున్న ప్రాధాన్యం ● రద్దవుతున్న మంత్రుల పర్యటనలు
- గ్రూపు తగాదాలతో 'హస్త'వ్యస్తం ● ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాల, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేక్ వ్యవహరిస్తున్న తీరును ప్రజానీకం చీదరించుకుంటున్నది. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి సమస్యలు పట్టించుకోకపోవడంతో ఆయనపై రోజు రోజుకూ వ్యతిరేకత పెరుగుతున్నది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సమస్యలపై నిలదీస్తున్నారు. ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ ప్రాధాన్యం తగ్గుతున్నది. ఇటీవల నియోజకవర్గంలో ఇద్దరు రాష్ట్ర మంత్రుల పర్యటన ఖరారై.. చివరి నిమిషంలో రద్దుకావడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సమస్యలు తెలుసుకునేందుకు ప్రజలతో మమేకమైంది లేదు. ఏదో మొక్కబడిగా చుట్టుపు చూపుగా గ్రామాల్లో పర్యటించడం.. కనీసం కారులో నుంచి కింద అడుగుపెట్టకుండా.. సమస్యలు వినకుండా వెళ్లిపోతుండడంతో ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ఆగస్టు 7న కోటపల్లి మండలం కొల్లూరు గ్రామానికి ఎమ్మెల్యే వివేక్ రాగా, 'మా ఊరిలో రోడ్లు సక్కగా లేవు. డ్రైనేజీలు లేక మురుగు నీరు రోడ్లపై పారుతుంది. జర్వాలు వచ్చి చస్తున్నా పట్టించుకుంటలేరు. సారూ... మీరు ఇప్పుడా వచ్చేది' అంటూ గ్రామస్తులు నిలదీసిన విషయం విదితమే. అన్ని సమస్యలు పరిష్కరిస్తానంటూ హడావుడిగా వాహనంలో బయలుదేరిన ఆయనను మహిళలు అడ్డుకొని మరీ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే సెప్టెంబర్ 6న చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలో పర్యటించగా అక్కడా గ్రామస్తులు సమస్యలపై ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీశారు. గెలిచి తొమ్మిది నెలలు అవుతుందని, ఏ ఒక్క సమస్యనైనా పరిష్కరించారా అంటూ ప్రశ్నించారు. 'మీరు ఎంపీగా ఉన్నప్పుడు సుద్దాల వాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని చెబితిరి.. ఆపై ఆ హామీని మరచిపోతిరి. చివరికి బాల్క సుమన్ ఎమ్మెల్యే అయ్యాక సుద్దాల వాగుపై బ్రిడ్జి నిర్మించారు.' అంటూ ఆయనకు వివరించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ లేకపోతుండడంతో పశువులు విద్యుత్ షాక్‌కు గురై చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఏ గ్రామానికి వెళ్లినా.. అక్కడి కాలనీలు తిరిగింది లేదు. సమస్యలు తెలుసుకున్నది లేదు. కారు దిగకుండా ఏదో వచ్చామా.. పోయామా అన్నట్లు పర్యటనలు చేస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇక ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో ఆయన పర్యటించగా, రైతులు రుణ మాఫీపై ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అందరికీ రూ. 2 లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పిన్రు. గెలిచినంక ఏవేవో కొర్రీలు పెట్టి గోస పెట్టుకుంటున్నరు. ఇది మీకు న్యాయమా అంటూ రైతులు నిలదీశారు. కొన్ని గ్రామాల్లో తమకు రూ.500 గ్యాస్ సిలిండర్ రావడం లేదని ప్రశ్నించారు. ఇలా నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం పార్టీలో ప్రాధన్యతను తగ్గించిందన్న చర్చనడుస్తున్నది. అందుకే చెన్నూర్‌లోని శివలింగాపూర్ వద్ద సింగరేణి ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్, జైపూర్ సింగరేణి విద్యుత్ కేంద్రంలోని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఆగస్టు 31న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన ఖరారై.. చివరి నిమిషంలో రద్దు అయ్యింది. అదే రోజున పెద్దపల్లి జిల్లాతో పాటు మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క పర్యటించాల్సి ఉంది. అయితే పెద్దపల్లి జిల్లాలో మాత్రమే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించి, చెన్నూర్‌కు రాకుండానే వెళ్లిపోయారు. అలాగే ఈ నెల 6న మంత్రి సీతక్క చెన్నూర్ పర్యటన ఖరారు కాగా, ఆమె పర్యటన కూడా రద్దు అయ్యింది. చెన్నూర్ పట్టణంలో అమృత్ పథకంలో భాగంగా రూ .31 కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంకు నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయాల్సి ఉంది. అయితే మంత్రి సీతక్క పర్యటన చివరి నిమిషంలో రద్దుకావడంతో తండ్రీ కొడుకులైన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీలే వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఒకవైపు ఇదిలా ఉంటే మారో వైపు నియోజకవర్గంలోని పార్టీలో నాయకుల మధ్య గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. చెన్నూర్‌లో అమృత్ పథకంలో వాటర్ ట్యాంకు శంకుస్థాపన చేసిన అనంతరం తండ్రీ కొడుకులు ఓ వైపు సమావేశం నిర్వహిస్తుండగానే.. పక్కన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు పెద్ద నాయకులు గొడవపడ్డారు. పార్టీ కార్యక్రమానికి ఖర్చుపెట్టిన డబ్బుల విషయంలో చెన్నూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూల రాజిరెడ్డి, భీమారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి ఘర్షణ పడ్డారు. ఇదంతా అక్కడున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ముందే జరిగింది. అయితే తమకు సంబంధం లేదనట్లుగా ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ కార్యక్రమం ముగించుకుని అక్కడి నుంచి జారుకున్నారు. ఇలా రోజురోజుకూ ఎమ్మెల్యే వివేక్‌పై, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరగుతుండడం, నాయకులు మధ్య గూపు తగాదాలు జరుగుతుండడంతో తమ భవిష్యత్‌పై కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.


చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలో ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీస్తున్న మహిళలు (ఫైల్)


ఆసిఫాబాద్ టౌన్ : బ్రాహ్మణవాడ గణపతి శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు



ఇందారం గోదావరి బ్రిడ్జిపైకి వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న భక్తులు

# వినాయకా వీడ్కోలిక

- వైభవంగా గణనాథుడి శోభాయాత్రలు ● గోదావరి, వాగుల్లో నిమజ్జనం
- బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. నినాదాలతో మార్మోగిన వీధులు
- ఆకట్టుకున్న కోలాటాలు, నృత్యాలు ● పోలీసుల భారీ బందోబస్తు

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో వినాయక నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులు సోమవారం గంగమ్మ ఒడికి చేరారు. డప్పు చప్పుళ్ల హోరు.. యువతీ యువకుల నృత్యాలు, కోలాటాలు, పిల్లల కేరింతల నడుమ శోభాయాత్రలు కనుల పండువగా సాగాయి. 'జై బోలో గణేశ్ మహారాజ్‌కీ.. గణపతి బొప్పా' నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి లంబోదరుడికి మొక్కులు తీర్చుకున్నారు. గోదావరి, వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేసి.. వెళ్లిరా గణపయ్య అంటూ వీడ్కోలు పలికారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద ఏర్పాట్లను సీపీ శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ పరిశీలించారు. ఆయన వెంట లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐలు ఉన్నారు.


ఆసిఫాబాద్ టౌన్ : వినాయకుడి శోభాయాత్ర


జన్నారం : భారీ వినాయకుడి శోభాయాత్ర


దండేపల్లి : గూడెం వద్ద క్రేన్ సాయంతో వినాయకుడి నిమజ్జనం


కన్నెపల్లి మండల కేంద్రంలో యువకుల నృత్యం


జైపూర్ : ఇందారం గోదావరిబ్రిడ్జి వద్ద వినాయకుడి నిమజ్జనం


రెబ్బెన : గణనాథుడి శోభాయాత్రలో భక్తులు


హాజీపూర్ : ముల్కల్లలో గణనాథుని శోభాయాత్రలో మహిళలు


మందమర్రి : రామకృష్ణాపూర్‌లో శోభాయాత్రలో మహిళలు, చిన్నారులు


దండేపల్లి : గూడెం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ, డీసీపీ, ఏసీపీ

## అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 16 : నేడు నిర్వహించనున్న వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లో 250 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 950 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు


పెద్దవాగును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

## నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 16 : కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని పెద్దవాగును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శోభాయాత్రలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, నాయకులు కీర్తి శ్రీనివాస్, వనమాల రాము పాల్గొన్నారు.

## మంచిర్యాలలో నేడు..


మంచిర్యాలలో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ, డీసీపీ, ఏసీపీ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామగుండం సీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శోభాయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్‌ను పోలీసులు సిద్ధం చేశారు. సీపీ, డీసీపీ, ఏసీపీ రూట్‌మ్యాప్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గూడెం రాయపట్నం, లక్షెట్టిపేట గోదారి పుష్కర ఘాట్, ఇందారం, మంచిర్యాల గోదావరి నది ప్రాంతం, సీతారాంపల్లి, చెన్నూరు పెద్ద చెరువు, బెల్లంపల్లి పోచమ్మ చెరువులో నిమజ్జనం చేయనున్నారు. డీజేలకు అనుమతి లేదని పోలీసు వర్గాలు తెలిపాయి. డ్రోన్, సీసీ కెమెరాల నిఘాలో శోభాయాత్ర సాగనున్నది.

## ఇంటింటికీ సోలార్ విద్యుత్ అందిస్తాం

**కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు**

దండేపల్లి, సెప్టెంబర్16 : పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఇంటింటికీ సోలార్ విద్యుత్ సరఫరా చేస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం వెల్గనూర్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి పైలట్ ప్రాజెక్టు రూపకల్పన కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వెల్గనూర్ గ్రామంలో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి రూ.30 కోట్లు కేటాయించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మూడు అదనపు గదులు, వంట, భోజనశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి వ్యవసాయ మోటార్లు, నివాస ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, ఎస్ఈ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, మాజీ సర్పంచ్ శంకరయ్య, తదితరులు ఉన్నారు.


వెల్గనూర్‌లో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## 'ప్రజా పాలన'ను విజయవంతం చేయాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 16 : జిల్లాలో ఈ నెల 17న ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 9.55 గంటలకు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరై గౌరవ వందనం స్వీకరిస్తారని, 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం జాతీయ గీతాలాపన, ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## గణపయ్యకు మాజీ ఎమ్మెల్యే పూజలు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 16 : మంచిర్యాల పట్టణంలోని 6వ వార్డులోగల గర్మిళ్ల హనుమాన్ గణేశ్ మండలి వద్ద సోమవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు. ఆయన తనయుడు విజిత్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


గణనాథుడికిపూజలు చేస్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679